# 18

# యేసు: దేవత్వ సంబంధమైన వాదనలు

ఇరవై శతాబ్దాలుగా నజరేయుడగు యేసు నరునిగా ఆశ్చర్యమైనవాడై ఉన్నాడు. పాపరహితుడైన దేవుని కుమారుడని, మనుష్యులను వారి పాపములనుండి రక్షించువాడునై ఉన్నాడని అతనియందు విశ్వాసముంచినవారు ఆయనను సేవించుతారు. ఆయన శత్రువులును, వేర్వేరు పరిమాణాలలో అవిశ్వాసులైన వారును ఆయనను అవమాన పరచడానికి లెక్కలేనన్ని వ్యర్థ ప్రయత్నాలు చేశారు కాని ప్రతికోణంనుండి ఆయన మానవా తీతుడైయున్నట్టు (వారు ఒప్పుకొనక తప్పలేదు).

దినము అనేది ఎన్నడు లేనప్పటినుండి, తనకు ముందు ఎవరు లేనప్పటినుండి ఆయన జీవించాడు. పద్ధతిలోను, విషయంలోను ఏ తరములోని ఏ నరుని కంటెను ఆయన ఉపదేశాలు ఉన్నతమైనవి - ఆయన కార్యములు నిజంగా దేవుని కార్యములై యున్నాయి. అసూయతో కూడిన నిరంతరపు వ్యతిరేకత జరుగుచున్నా, ఆయన యొక్క ప్రాబల్యం అనేకమంది జనులచేత అనుభవించబడుతునే ఉంది. మరియు ఆయన దినములనుండి ఉన్న ఏ యితర నరునికంటెను ఎక్కువైన మంచితనానికి జనులు నడిపింపబడుతునే ఉన్నారు.

ఈ వాస్తవాలకు దుష్టులైన మనుష్యులను, అవిశ్వాసులును పలు విధాలుగా వివరణలు యివ్వడానికి ప్రయత్నించినా, సంతృప్తికరమైన వివరణ ఒక్కటే ఒక్కటుంది. వెంటనే సరళమయ్యింది, ఘనమైనది నిష్కపటియైన ఇశ్రాయేలీయుని నోటనుండి వస్తుంది: "బోధకుడా, నీవు దేవుని కుమారుడవు" (యోహాను 1:49ఎ; 47 వ. చూడు). లేఖనముల యొక్క బోధ ప్రకారం నజరేయుడగు, యేసు, దేవుడైయున్నాడు శరీరంలో ఉన్న దేవుడు, శరీరధారిగా ఉన్న దేవుడు, సశరీరుడుగా ప్రత్యక్షుడైన దేవుడు.

## ఆయన దేవుడైయున్నట్టు ప్రవక్తలు పలికారు

**యెషయా**

యేసు జన్మించడానికి వందలకొలది సంవత్సరాలకు ముందు యెషయా యిలా అన్నాడు, "ఆలకించుడి, కన్యక గర్భవతియై కుమారుని కని అతనికి ఇమ్మానుయేలను పేరుపెట్టును" (యెషయా 7:14). ప్రభువైన యేసు జన్మించినప్పుడు, ఈ ప్రవచనం నెరవేర్చబడినట్టు మత్తయి చెప్పాడు (మత్తయి 1:22) "ఇమ్మానుయేలను" మాటను అతడు, "దేవుడు మనకు తోడు" అని వివరించాడు (మత్తయి 1:23). ఈలాగున, యెషయా మరియు మత్తయిల ప్రకారం, యేసు "దేవుడు మనకు తోడైయున్నాడు."

ఆయన అవతరణను మరల యెషయా ఈ మాటలతో ప్రవచించాడు:

> ఏలయనగా మనకు శిశువు పుట్టెను మనకు కుమారుడు అనుగ్రహించబడెను. ఆయన భుజము మీద రాజ్యభారముండును. ఆశ్చర్యకరుడు ఆలోచనకర్త బలవంతుడైన దేవుడు నిత్యుడగు తండ్రి సమాధానకర్తయగు అధిపతి అని అతనికి పేరు పెట్టబడును (యెషయా 9:6).

ఈ ప్రతిపాదనలో దావీదు సింహాసనం మీద కూర్చోబోయేవాడు "బలవంతుడైన దేవుడు" అయ్యుంటాడని మనం నేర్చుకుంటున్నాం. తాను కుమారుని కని ఆయనకు యేసు అను పేరు పెట్టుదువని దేవదూతయైన గబ్రియేలు మరియకు తెలిపినప్పుడు అతడు నిస్సందేహంగా ఈ ప్రవచనాన్ని జాడగా సూచించాడు (లూకా 1:31). "ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడనబడును; ప్రభువైన దేవుడు ఆయన తండ్రియైన దావీదు సింహాసనమును ఆయన కిచ్చును" (లూకా 1:32). మరియ కుమారుడు "సర్వోన్నతుని కుమారుడనబడతాడు," ఎందుకంటే ఆయన యెషయా ప్రవచనంలోని "బలవంతుడైన దేవుడు."

**మీకా**

ప్రవక్తయైన మీకా యిలా అన్నాడు, "బేత్లెహేము ఎఫ్రాతా, యూదావారి కుటుంబము లలో నీవు స్వల్ప గ్రామమైనను నా కొరకు ఇశ్రాయేలీయులను ఏలబోవువాడు నీలోనుండి వచ్చును; పురాతన కాలము మొదలుకొని శాశ్వత కాలము ఆయన ప్రత్యక్షమగు చుండెను" (మీకా 5:2). క్రీస్తు ఎక్కడ జన్మించునని హేరోదు అడిగినప్పుడు, ప్రధాన యాజకులును శాస్త్రులును చూపిన ప్రవచనమిది. హేరోదు జ్ఞానులను బేత్లెహేమునకు పంపడానికి కారణమైన ప్రవచనమిది, "యూదులకు రాజుగా పుట్టిన" వానిని వారు కనుగొనబోయే స్థలమది (మత్తయి 2:2-8). మీకా ప్రకారము, యూదులకు రాజుగా జన్మించినవాడే శాశ్వత కాలంనుండి శాశ్వతకాలంవరకు ఉన్నవాడు. సృష్టిలో దేనిని గూర్చియు ఈ మాటలు చెప్పబడవు; ఆలాటి మాటలతో సృష్టికర్త మాత్రమే వర్ణింపబడతాడు. ఈ విధంగా, ఈ ప్రవచనాన్ని బట్టి ఆయన దేవుడుగా గుర్తింపబడవలసి ఉంది.

## ఆయన దేవుడైయున్నట్టు యేసు చెప్పుకున్నాడు

**యూదుల భావన**

యేసు దేవుడైయున్నట్టు చెప్పుకున్నాడనేదాన్ని లేఖనాలనుండి రుజువు చేయక ముందు, మెస్సీయాను గూర్చిన యూదుల భావనను మనము ఎరుగవలసియుంది. జస్టిన్ మార్టియార్‌తో (సి.110-సి.165) వారి సభ్యులలో ఒకడైయున్న ట్రిఫో జరిపినట్టి ప్రఖ్యాతిగాంచిన సంభాషణలో ఈ భావన వ్యక్తపరచబడింది:

> ... ఈ క్రీస్తు యూగాలకు పూర్వము దేవుడుగా ఉన్నాడు, తరువాత జన్మించడానికి తన్ను లోబరచుకొని మనుష్యుడయ్యాడని, అయినా ఆయన నరునివలన నరుడు కాదనేది (దృఢముగా చెప్పడం) నాకు కేవలం విరోధ భావంగా మాత్రమే కాదు, బుద్ధిహీనతగా కూడా కన్పిస్తుంది.[1]
>
> ఆయన నరుడుగా ఉన్నాడని స్థాపించి, ఏర్పాటుననుసరించి అభిషేకింపబడ్డాడని, అటు తరువాత క్రీస్తు అయ్యాడని స్థాపించేవారు నాకు చూపునకు న్యాయముగా నున్నట్టు కన్పిస్తారు

... ఎందుకంటే క్రీస్తు మానవులలో మానవుడుగా జన్మిస్తాడు, ఆయన వచ్చినప్పుడు ఏలీయ ఆయనను అభిషేకిస్తాడు. కాని ఈ మనుష్యుడు క్రీస్తులా కన్పించాడంటే, అతడు తప్పకుండా మనుష్యులలో జన్మించిన మనుష్యుడైయుండాలి; అయితే ప్రస్తుతపు పరిస్థితిని బట్టి యింకను రాలేదు, ఈ మనుష్యుడు ఆయన (క్రీస్తు) కాడని నేను అభిప్రాయపడుతున్నాను.[2]

మత్తయి 22:41-45లో దాఖలు చేయబడిన సంభవంనుండి, ప్రభువైన యేసు దినాలలో యూదులు యిట్టి నమ్మకం కలిగియున్నట్టు కన్పిస్తారు:

ఒకప్పుడు పరిసయ్యులు కూడియుండగా యేసు వారిని చూచి క్రీస్తును గూర్చి మీకేమి తోచుచున్నది? ఆయన ఎవని కుమారుడని అడిగెను. వారు ఆయన దావీదు కుమారుడని చెప్పిరి. అందుకాయన ఆలాగైతే, – నేను నీ శత్రువులను నీ పాదముల కింద ఉంచువరకు నీవు నా కుడిపార్శ్వమున కూర్చుండమని ప్రభువు నా ప్రభువుతో చెప్పెను అని దావీదు ఆయనను ప్రభువని ఆత్మవలన ఏల చెప్పుచున్నాడు? దావీదు ఆయనను ప్రభువని చెప్పిన యెడల, ఆయన ఏలాగు అతనికి కుమారుడగునని అడిగెను

తన సంతతిలోనుండి వచ్చిన వానిని దావీదు "ప్రభువు" అని ఎందుకు పిలిచెనో వారు వివరింపజాలక పోయారు. దానికి సూక్ష్మమైన జవాబేమంటే దావీదు కుటుంబములో మెస్సీయా "మానవుడుగా మానవ తల్లిదండ్రులకు జన్మిస్తాడని" వారు ఎదురు చూచారు. దేవుడు శరీరధారియౌతాడన్న సంగతిని బోధించిన లేఖనాలను వారు ఎరిగినవారైయుంటే (శరీరము దావీదునుండి సంక్రమించింది) వారు ఆ ప్రశ్నకు జవాబు చెప్పియుండేవారే.
యూదుల యొక్క అంచనాలో, తాను క్రీస్తును (మెస్సీయాను) అని ఒకడు చెప్పు కొనడంలో తప్పులేదు సరిగదా; ఒకని క్రీస్తని జనులు నమ్మడంలోకూడా నేరం లేదు. మత్తయి 9:27లో యిద్దరు గుడ్డివారు యేసును "దావీదు కుమారుడా" అని సంబోధించారు; మత్తయి 15:22లో కనాను స్త్రీ అదే పని చేసింది. ప్రభువు యెరూషలేములోనికి "విజయోత్సవంతో ప్రవేశించినప్పుడు," "దావీదు కుమారునికి జయము" అంటూ జన సమూహాలు ఆయన ముందర నడిచాయి (మత్తయి 21:1-17). "దావీదు కుమారుడు" అనేది మత్తయి 21:9లోను 22:42లోను ఒకే విధంగా ఉపయోగింపబడింది. జన సమూహము ఆయనను క్రీస్తు అని పిలుస్తుంది, అయినా బహు అల్ప సంఖ్యాకులు మాత్రమే ఆయనను దేవుని కుమారుడని, అంటే శరీరంలో ఉన్న దేవుడని నమ్మారు. దినాల లోపలే, ఆయన దేవుని కుమారుడనని చెప్పుకున్నందుకు దేవదూషణయని ఆయనకు శిక్ష విధించడంలో వారు తమ నాయకులతో చేతులు కలిపారు.

### తనను గూర్చి యేసు చెప్పుకున్నది

దీనినంతటిని మనస్సులో ఉంచుకొని, తాను దేవుడనని ప్రభువైన యేసు చెప్పుకున్న దానిని గమనించు. "నరపుత్రుడు" అంటే నరుడనే భావం ఎలాగో, అలాగే "దేవుని కుమారుడు" అంటే "దేవుడనే" భావంతో ఆయన పదాలను ఉపయోగించాడు. యోహాను 5:17, 18లో యిలా చదువుతాం,

అయితే యేసు – నా తండ్రి యిదివరకు పనిచేయుచున్నాడు, నేనును పనిచేయు చున్నానని వారికి ఉత్తరమిచ్చెను. ఆయన విశ్రాంతి దినాచారము మీరుట మాత్రమేగాక, దేవుడు తన

> సొంత తండ్రి అని చెప్పి, తన్ను దేవునితో సమానునిగా చేసికొనెను గనుక ఇందు నిమిత్తము యూదులు ఆయనను చంపవలెనని మరి ఎక్కువగా ప్రయత్నము చేసిరి.

దేవుని కుమారులని యూదులు తమ్మును తాము పిలుచుకున్నారు, మరియు దేవుని తమ తండ్రియని పిలిచారు (యోహాను 8:41). తప్పక, దేవుడు తన తండ్రియని యేసు చెప్పుకొనడాన్ని వారు ఆక్షేపించనవసరం లేదు – అయితే వారు ఆక్షేపించారు. ఎందుకు? “తన సొంత తండ్రి” అనే భావంతో ప్రభువు ఆ పదాన్ని వినియోగించారు, అంటే ఆయన “దేవునితో సమానుడైనట్టు” అందు నిక్షిప్తమైయుంది. ఆయన దేవునితో సమానునిగా చేసికొన్న పదం ఆయన ఉపయోగించినప్పుడు, తాను దేవుడనని పిలుచు కొన్నట్టే, దానిని వారు దేవ దూషణగా భావించారు.

యోహాను 8:53బి, 54లో, “నిన్ను నీ వెవడవని చెప్పుకొనుచున్నావని (యూదులు) ఆయననడిగిరి. అందుకు యేసు – నన్ను నేను మహిమపరచుకొనినయెడల నా మహిమ వట్టిది; మా దేవుడని మీరెవరిని పిలుస్తున్నారో, ఆ నా తండ్రియే నన్ను మహిమపరచు చున్నాడు.” యూదులు తమ దేవుడని ఎవరిని పిలుస్తున్నారో, ఆయన తన సరియైన తండ్రియని గుర్తు చూపాడు. తాను ప్రత్యేక మార్గంలో దేవుని కుమారుడైయున్నాడని మరి ఎవనికి అలాటి విశేషత లేదని యింకో విధంగా చెప్పుకున్నట్టే. అందువలన, ఆయన తన్ను దేవునితో సమానునిగా చేసికొన్నాడు.

దేవుని కుమారుడనని యేసు చెప్పుకున్నప్పుడు ఆయన తనను దేవునితో సమానునిగా చేసికొంటున్నాడన్న సంగతి యూదులు గ్రహించారు. అది యోహాను 10:30–36లో స్పష్టపరచబడింది. “నేనును తండ్రియు ఏకమైయున్నాము” అన్న యేసు యొక్క ప్రతిపాదన బలమైన రియాక్షన్ను తెచ్చింది:

> ... యూదులు ఆయనను కొట్టవలెనని మరల రాళ్లు చేత పట్టుకొనగా, యేసు – తండ్రి యొద్దనుండి అనేకమైన మంచి క్రియలను మీకు చూపితిని; వాటిలో ఏ క్రియ నిమిత్తము నన్ను రాళ్లతో కొట్టుదురని వారినడిగెను. అందుకు యూదులు – నీవు మనుష్యుడవై యుండి దేవుడనని చెప్పుకొనుచున్నావు గనుక దేవదూషణ చేసినందుకే నిన్ను రాళ్లతో కొట్టుదుము గాని మంచి క్రియ చేసినందుకు కాదని ఆయనతో చెప్పిరి. అందుకు యేసు – మీరు దైవములని నేనంటినని మీ ధర్మశాస్త్రములో వ్రాయబడి యుండలేదా? లేఖనము నిరర్థకము కానేరదు గదా; దేవుని వాక్యమెవరికి వచ్చెనో వారే దైవములని చెప్పినయెడల – నేను దేవుని కుమారుడనని చెప్పినందుకు, తండ్రి ప్రతిష్ఠచేసి యీ లోకములోనికి పంపినవానితో – నీవు దేవదూషణ చేయుచున్నావని చెప్పుదురా?

తాను “దేవుని కుమారుడనని” యేసు చెప్పుకొన్నప్పుడు, ఆయన దేవుడైయున్నట్టు చెప్పుకొంటున్నాడని యూదులు గ్రహించినట్టు యిక్కడ తేట తెల్లం చేయబడింది.
ఇలా చెప్పుకున్నదే కడకు ఆయన మరణానికి దారితీసింది. “నీవు క్రీస్తువైతే మాతో స్పష్టముగా చెప్పుము” అని యూదుల సభయెదుట ఆయన ఆజ్ఞాపించబడ్డాడు. తాను చెప్పుకున్న దానిని సందేహించడానికి వారికిక ఏమియు లేకపోయింది. తరువాత, “అప్పుడు నీవు దేవుని కుమారుడవా?” అని ఆయన అడుగబడ్డాడు. “అవును నేనే” అనే ఆయన జవాబు వచ్చింది. దానితో యూదులు “మనకిక సాక్షులతో పని ఏమి? మనము అతని నోటిమాట వింటిమిగదా

అని చెప్పిరి” (లూకా 22:66–71 చదువు).

అప్పుడు వారు ఆయనను పిలాతు వద్దకు తీసికొనిపోయారు. ఆయన మీద మోపబడిన తొలి నేరం ఆయన తన్ను తానే “క్రీస్తు” రాజుగా చేసికొన్నాడని. ఆ నేరము ఆయనకు మరణ శిక్షను తేలేదని వారు చూచినప్పుడు, “మా కొక నియమము కలదు; తాను దేవుని కుమారుడనని అతడు చెప్పుకొనెను గనుక ఆ నియమము చొప్పున ఇతడు చావవలెనని అతనితో చెప్పిరి” (యోహాను 19:7). వారి నియమాన్నిబట్టి దేవదూషణ చేసినవాడు చంపబడాలి (లేవీయ. 24:16). ఆయన దేవుని కుమారుడని ఒప్పుకున్నాడు గనుక దేవదూషణ చేసినట్టు వారాయనపై నేరం మోపారు (మత్తయి 26:63–66). అప్పుడు, దేవునితో సమానుడని; శరీరధారిగానున్న దేవుడని ఆయన చెప్పుకున్నాడు.

## ఆయన దేవుడైయుండెనని అపొస్తలులు ప్రకటించారు

ప్రభువైన యేసు భూమిమీద ఉన్న దినాల్లో ఆయనకు సన్నిహితంగా మనుష్యులు ఆయన అద్భుతములను చూచినవారు మూడు సంవత్సరాలకు మించిన కాలం ఆయన బోధను నిరంతరం విన్నది ఆయన అపొస్తలులు. ఆయన సమాధిని గెలిచి లేచిన తరువాత ఆ మనుష్యులు ఆయనను చూచారు ఆయనతోకూడా తిన్నారు. తరువాత వారు పరిశుద్ధాత్మలో బాప్తిస్మం పొందారు. ఆయన వారిని దోషంనుండి కాపాడి, నడిపించడం మాత్రమేగాక, మనకు ఆ వర్తమానాన్ని అందించడానికిగాను ఆయన వారికి మాటలను కూడా యిచ్చాడు. యేసు దేవుని కుమారుడని, శరీరధారిగా చేయబడిన దేవుడని, సశరీరుడుగా ప్రత్యక్షుడైన దేవుడని ఆ మనుష్యులు తెలిపారు.

### యోహాను

తండ్రియైన దేవునితో మన ప్రభువునకు ఉన్న బాంధవ్యాన్ని బహు సంపూర్ణంగా గ్రహించి అభినందించినవాడు, ఆయన ప్రియ శిష్యుడైన యోహానే కావచ్చు. దోషం జరుగకుండునట్లు అతడు పరిశుద్ధాత్మచే నడిపింపబడి, యిలా వ్రాశాడు,

> ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవుని యొద్ద ఉండెను, వాక్యము దేవుడై యుండెను. ఆయన ఆదియందు దేవుని యొద్ద ఉండెను. సమస్తము ఆయన మూలముగా కలిగెను, కలిగియున్నదేదియు ఆయన లేకుండ కలుగలేదు. ఆయనలో జీవముండెను; ఆ జీవము మనుష్యులకు వెలుగైయుండెను …
>
> ఆ వాక్యము శరీరధారియై, కృపాసత్య సంపూర్ణుడుగా మనమధ్య నివసించెను; తండ్రివలన కలిగిన అద్వితీయకుమారుని మహిమవలె మనము ఆయన మహిమను కనుగొంటిమి (యోహాను 1:1–4, 14).

“వాక్యము” అని యిక్కడ ప్రస్తావించబడింది దైవత్వంలోని రెండో వ్యక్తి. ఆ వాక్యము యేసు అయ్యాడు. ఈ వాస్తవాన్ని గురించి వాదించనక్కరలేదు, ఎందుకంటే 14వ వచనంలో ఆ విషయం చెప్పబడింది. అందువలన, ఈ వాక్యమును గూర్చిన ప్రతిపాదనలను తొలిగా గమనించుదము, అవి దేవుడనే విషయాన్ని రుజువు చేస్తుంది. రెండవది, దేవుడుగా రుజువు చేయబడిన ఈ వాక్యము శరీరమును ధరించి, నజరేయుడగు యేసు అను పేరుతో

పిలువబడ్డాడు.

వాక్యము యొక్క నిత్యత్వం "ఆదియందు ... ఉండెను" ప్రయోగంతో మొదట చెప్పబడింది. ప్రతి ఒక్కటి ఉనికిలోనికి రానారంభించినప్పుడు వాక్యము అంతకు ముందుగానే "ఉండెను." సృష్టింపబడిన ఏ దేనికైనా ఆయన ముందుగానే ఉన్నాడు. అందువలన, ఆయన సృష్టిలో ఎంత మాత్రమును భాగమై ఉండలేదు; ఆయన నిత్యుడు. దేవుడు తప్ప ఎవడును నిత్యుడైయుండడు గనుక ఆయన (కుమారుడైన) దేవుడే.

తరువాత, ఈ లేఖన భాగంలో తాను తండ్రియైన దేవునితో ఏకముగానుండు, అంటే, కలిసి జీవించునట్టుగా రెండు మార్లు చెప్పబడింది: "వాక్యము దేవుని యొద్ద ఉండెను"; "ఆదియందు వాక్యము దేవునియొద్ద ఉండెను." అప్పుడు, ఆయన అవసరమైన మరియు వ్యక్తిగతమైన దైవత్వము స్థిరపరచబడింది: "వాక్యము దేవుడై యుండెను." తండ్రినుండి తనకున్న వ్యత్యాసము చెప్పబడింది: "ఆయన ఆదియందు దేవునియొద్ద ఉండెను." ఇద్దరు (Beings) ఉండునట్టి వారున్నారు, వారిలో ప్రతి ఒక్కరు "దేవుడు" అని పిలువబడుతున్నారు అనే భావాన్ని తెలుపక పోయినట్లయితే, ఈ మాటలు వివేక శూన్యమైన గందరగోళమే అయ్యుంటుంది. "వాక్యము దేవుడై యుండెను," అయినప్పటికిని, "దేవుడు" అని పిలువబడే మరియొక ఉండునట్టివానితో ఉన్నాడు; తత్ ఫలితంగా, "దేవుడు" అని పిలువబడే యిద్దరు (Beings) ఉండునట్టివారున్నారు. మరోవైపు, వారి ఏకత్వాన్ని బట్టి "దేవుడొక్కడే" అని మనం నిజంగా అనవచ్చు.

పైగా, ఈ వాక్యము సృష్టికర్తయైయున్నట్టు చెప్పబడ్డాడు: "సమస్తమును ఆయన మూలముగా కలిగెను, కలిగియున్న దేదియు ఆయన లేకుండ కలుగలేదు." సృష్టియంతటికి ముందుగా ఆయన ఉన్నాడు గనుక ఆయన సృజింపబడినవాడుకాడని మరల యిది రుజువు చేస్తుంది. ఆయన స్వయం ఉనికి మరియు ఆయన ఉత్సాహపరచెడు, విశదపరచెడు శక్తి తరువాత ప్రతిపాదనలో తెలియజేయబడింది: "ఆయనలో జీవ ముండెను, ఆ జీవము మనుష్యులకు వెలుగైయుండెను." దీనిని బట్టి, ఆయన సమస్త జీవమునకును, వెలుగుకును మూలమైయున్నాడు. నిజంగా, ఆయన దేవుడే.

ఈ (Being) ఉన్నవాడు, ఈ వాక్యము, "శరీరధారియై కృపాసత్య సంపూర్ణుడుగా మనమధ్య నివసించెను." ఆయన శరీరధారియవ్వడంలో, ఆయన వాక్యము, దేవుడు అయ్యున్నట్టుగా చేయబడిన సహజ గుణములలో దేనిని ఆయన పోగొట్టుకోలేదు. "అబ్రాహాము పుట్టకమునుపే నేనున్నాను" అని ఆయన తన నిత్య ఉనికిని చాటుకున్నాడు (యోహాను 8:58). నజరేయుడగు యేసుగా, "తండ్రీ, లోకము పుట్టకమునుపు నీయొద్ద నాకు ఏ మహిమ ఉండెనో ఆ మహిమతో నీయొద్ద నన్నిప్పుడు మహిమపరచుము" అంటూ, తండ్రితో తనకున్న నిత్య ఉనికిని ఆయన ప్రకటించాడు (యోహాను 17:5).

1 యోహానులో ప్రభువైన యేసు యొక్క దైవత్వానికి యింకను రుజువును మనం కనుగొంటాం. ప్రియుడైన అపొస్తలుడు 1:2లో యిలా వ్రాశాడు, "ఆ జీవము ప్రత్యక్ష మాయెను; తండ్రియొద్ద ఉండి మాకు ప్రత్యక్షమైన ఆ నిత్యజీవమును మేము చూచి, ఆ జీవమును గూర్చి సాక్ష్యమిచ్చుచు, దానిని మీకు తెలియపరచుచున్నాము." తన సువార్త వర్ణనలో యోహాను చేసిన ప్రతిపాదన వంటిదే యిది. ప్రత్యక్షమైన జీవము నిత్యజీవము. అది మొదట తండ్రియొద్ద ఉండి, అటు తరువాత మాకు (లేక మనకు) ప్రత్యక్షపరచ బడింది. దేవుని కుమారుడు తండ్రియొద్ద ఉండి, తరువాత మనకు ప్రత్యక్షపరచ బడినట్లయితే, నిత్యజీవము దేవుని కుమారుడైయున్నట్టు

మనం తీర్మానం చేసికొంటే, మనం కరక్టు అయ్యుండాలి; కాని తీర్మానాలు చేసేదానికి మనకు అవకాశమివ్వలేదు. యోహాను యిలా అన్నాడు, “మనము సత్యవంతుడైన వానిని ఎరుగవలెనని దేవుని కుమారుడు వచ్చి మనకు వివేకమనుగ్రహించియున్నాడని యెరుగుదుము. మనము దేవుని కుమారుడైన యేసు క్రీస్తునందున్నవారమై సత్యవంతుని యందున్నాము ఆయనే నిజమైన దేవుడును నిత్యజీవమునైయున్నాడు” (1 యోహాను 5:20, 21). తండ్రితో కూడా ఉన్న నిత్యజీవము దేవుని కుమారుడని, మనకు శరీరధారిగా ప్రత్యక్షుడయ్యాడని, యేసు క్రీస్తుగా మనకు తెలియబడ్డాడని దీనినుండి నేర్చుకొంటున్నాం.

మన విచారణ దీనితో సరిగానే ముగించుకోవచ్చు, ఎందుకంటే, దేవుని కుమారుడైన యేసు క్రీస్తు శరీరధారియై మనమధ్య నివసించిన ఈయన “నిజమైన దేవుడై” యున్నాడు.

**పౌలు**

ప్రభువైన యేసు యొక్క దేవత్వాన్ని గూర్చి రచించిన మరియొక అపొస్తలుడు, పౌలు. ప్రభువు పరలోకానికి ఆరోహణుడైన తరువాత ఈ అపొస్తలునికి దర్శనమిచ్చారు, మరియు పరదైసులోనికి కొనిపోబడి మనుష్యుడు పలుకకూడని వచింపశక్యముకాని, మాటలు వినినవాడితడే (2 కొరింథీ. 12:2–4). ప్రభువైన యేసును అతడు ఈ మాటలతో వర్ణించాడు:

> ఆయన (క్రీస్తుయేసు) దేవుని స్వరూపము కలిగినవాడైయుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచుకొన లేదుగాని మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపమును ధరించుకొని, తన్నుతానే రిక్తునిగా చేసికొనెను. మరియు, ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనబడి మరణము పొందునంతగా, అనగా సిలువమరణము పొందునంతగా విధేయత చూపినవాడై తన్ను తాను తగ్గించు కొనెను (ఫిలిప్పీ. 2:6–8).

ఈ యేసు ఒకప్పుడు దేవునితో సమానముగా ఉన్నాడని, అయితే దానిని ఆయన ఖాళీచేసికొని, ఆ సమానత్వాన్ని వదలుకున్నాడని యిక్కడ పౌలు చెప్పాడు. భూమిమీద ఉన్నప్పుడు, దేవత్వము యొక్క సర్వపరిపూర్ణత శరీరముగా క్రీస్తునందు నివసించింది, దేవుని యొక్క సర్వశక్తులు ఆయనయందు ఉండడంలో యేసు దేవునితో సమానుడు. మరి ఆయన ఏ విషయంలో దేవునితో సమానుడుకాడు? ఆయన మనిషి (పోలికలో) రూపులో ఉన్నాడు, దేవుని రూపమైన, ఆత్మ రూపంలో లేడు. మానవ జాతితో తన్ను తాను ఒకడుగా చేసికొన్నప్పుడు దేవుని రూపమైన దానిని (ఆత్మ రూపాన్ని) ఆయన వదలుకున్నాడు. ఈ వివరణకొరకే మనం వెదకుతున్నాం – యేసు క్రీస్తు మనుష్య పోలికలో ఉన్న దేవుడు మరియు ఆయన శరీరమందు మన మధ్య దేవుడుగా నివసించాడు (హెబ్రీ. 2:14–17 చూడు).

దేవుని కుమారుని గూర్చి పౌలు యింకా యిలా చెప్పాడు,

> ఆయన అదృశ్య దేవుని స్వరూపియై సర్వసృష్టికి ఆదిసంభూతుడైయున్నాడు. ఏలయనగా ఆకాశమందున్నవియు భూమియందున్నవియు, దృశ్యమైనవిగాని, అదృశ్యమైనవిగాని, అవి సింహాసనములైనను ప్రభుత్వములైనను ప్రధానులైనను అధికారములైనను, సర్వమును ఆయనయందు సృజింపబడెను, సర్వమును ఆయన ద్వారాను ఆయననుబట్టియు సృజింపబడెను. ఆయన అన్నిటికంటె ముందుగా ఉన్నవాడు; ఆయనే సమస్తమునకు

ఆధారభూతుడు (కొలస్సీ. 1:15-17).

యేసు యొక్క దైవత్వాన్ని అంగీకరింపనివారు "సర్వసృష్టికి ఆదిసంభూతుడు" అనే ప్రయోగాన్ని, "మొదటిగా సృజింపబడినవాడు" అని అర్థం చెప్పుతారు. "సర్వసృష్టికి ఆది సంభూతుడని" అనే దానికి కారణం తరువాత ప్రతిపాదన యిస్తుంది - "ఆయనే సమస్తమునకు ఆధారభూతుడు - ఆయన ద్వారాను ఆయననుబట్టియు సర్వమును సృజించెను." "ఆది సంభూతుడు" అనే మాటకు వారసుడు మరియు ప్రభువు, మొదటిగా జన్మించినవాడు అనికూడా అర్థం వస్తుంది. సర్వసృష్టికి యేసు ప్రభువైయున్నాడు ఎందుకంటే సర్వము ఆయనచే సృజింపబడింది. దీనికి మంచి అర్థముంది: ముందు చెప్పబడిన వ్యాఖ్యానానికి అర్థం లేదు. "ఆయన అన్నిటికంటె ముందుగా ఉన్నాడంటే," సృజింపబడిన వాటన్నిటికంటే అని అర్థం. సృజింపబడిన ప్రతిదానికి ఆయన ముందుగా ఉన్నాడనేది ఆయన దైవత్వాన్ని నిరూపిస్తుంది. "ఆయనే సమస్తమునకు ఆధార భూతుడు" అనేది సృజింపబడిన దాని విషయమై చెప్పబడదు, సమస్తమును సృజించిన వాని గూర్చి మర్యాదగా చెప్పబడుతుంది.

అనుమానంగాని, అపార్థంగాని చేయడానికి కుదరని పౌలుయొక్క మరొక ప్రతిపాదనను ఆలోచన చేద్దాం. యూదులతో మాట్లాడడంలో, అతడిలా అన్నాడు, "... ఈయన సర్వాధికారియైన దేవుడైయుండి, నిరంతరము స్తోత్రార్హుడైయున్నాడు" (రోమా 9:5). ప్రస్తుతపు తర్జుమాలో ఈ లేఖన భాగం యొక్క స్పష్టమైన అర్థం, యూదుల వంశంలోనుండి వచ్చిన శరీరధారియైయున్న క్రీస్తు దేవుడైయున్నాడనేది. ఆయన దేవుడై యున్నందున, యూదుల వద్దనుండి (ఆయన పొందినవి, పొందుచున్నవి) పొందిన దీవెనలకేగాని, శాపాలకు ఆయన పాత్రుడైయుండడు.

ప్రభువైన యేసు యొక్క పునరుత్థానము ఆయన దేవుని కుమారుడనడానికి లేక శరీరమందలి దేవుడనడానికి అతిగొప్ప రుజువైయున్నట్టు అపొస్తలుడైన పౌలు భావిస్తాడు. "ఈయన నా ప్రియకుమారుడని" దేవుడు పరలోకంనుండి రెండు సార్లు పలికాడు (మత్తయి 3:17; 17:5; మార్కు 9:7; లూకా 9:35 చూడు), కాని యూదులు దాని నమ్మ నిరాకరించారు. ఏ నరుడును ఎన్నడు చేయనంతగా యేసు అద్భుతాలను చేశాడు, అయినా, వారు ఆయనను నమ్మలేదు. తాను దేవుని కుమారుడనని ఆయన ప్రమాణం చేసి చెప్పాడు; కాని ఆయన సాక్ష్యాన్ని అంగీకరించడానికి బదులు, దానిని బట్టి దేవదూషణ చేసిన వంచకుడని వారు ఆయనను సిలువ వేశారు. భూమిమీదనున్న హెచ్చయిన న్యాయస్థానాల యొక్క తీర్మానాన్ని త్రిప్పివేసిన పరమందున్న మహాఘనుడగు దేవుడు, క్రీస్తును మృతులలోనుండి లేపుటవలన, ఆయనను తన కుమారుడని ప్రకటించాడు.

సువార్తను గూర్చి మాట్లాడుతూ, పౌలు యిలా వ్రాశాడు,

> యేసు క్రీస్తు, శరీరమునుబట్టి దావీదు సంతానముగాను, మృతులలోనుండి పునరుత్థానుడైనందున పరిశుద్ధమైన ఆత్మనుబట్టి దేవుని కుమారుడుగాను ప్రభావముతో నిరూపింపబడెను (రోమా 1:3, 4).

మన ప్రభువైన యేసు క్రీస్తును దేవుని కుమారుడుగా పౌలు యిక్కడ సూచించాడు. ఈ కుమారునికి తన మానవత్వం దావీదు ద్వారా కలిగింది, కాని ఆయన పునరుత్థానము

ఆయన కేవలం నరమాత్రునికంటే అధికుడని ప్రకటిస్తుంది. ఆయన దేవుని కుమారుడని చెప్పబడడానికి సిలువ వేయబడ్డాడు – ఆయన దావీదు కుమారుడైనా, దానికి మించిన ఉన్నతమైన సంబంధం ఆయనకు ఉంది. దావీదుతో తనకున్న సంబంధాన్ని బట్టి ఆయనకు దైవత్వము రాలేదు, కాని దేవునితో ఆయనకు ఉన్న సంబంధాన్ని బట్టి కలిగింది. ఆయనను మృతులలోనుండి లేపడంవలన ప్రభువైన యేసు చెప్పుకొన్న దానిని దేవుడు ఘనపరచాడు. అటు దైవత్వానికిని యిటు యేసు క్రీస్తు యొక్క మానవత్వానికిని ఈ లేఖన భాగం స్థిరమైన బండగా నిలిచియుంది. “మన ప్రభువైన యేసు క్రీస్తు” అనే వ్యక్తియందు మానవత్వము దైవత్వము ఏకంగా బంధింపబడియుండగా, ఆ వ్యక్తిని దేవుని కుమారుడని పిలుస్తున్నాం.

శరీరానికి సంబంధించి, క్రీస్తు దావీదు సంతతిగా “జన్మించాడు” అని పౌలు అన్నాడు, జన్మ ఆరంభాన్ని సూచిస్తుంది. ఏదియెలాగున్నా, క్రీస్తు యొక్క ఆత్మను గూర్చి “దేవుని కుమారుడని నిరూపింపబడ్డాడని” పౌలు అన్నాడు. ఇది ఆరంభాన్ని సూచించదు. నజరేయుడగు యేసునందు జన్మతో ఆరంభమైన మానవత్వము, దేవునితో దేవుడుగా ఉన్న దైవత్వము మిశ్రమమయ్యింది. ఆయనయందు – ఆయనయందు మాత్రమే – దేవుడు సశరీరుడుగా ప్రత్యక్షమైనట్టు మనం చూస్తాం.

## ఆయన పనులు ఆయనను దేవుడని ప్రకటిస్తాయి

ఆయన భూమిమీద ఉన్న దినాలలో, తన సొంత ప్రతిపాదన ప్రకారం, ప్రభువైన యేసు చేసిన పనులు ఎవనిచేతను ఎన్నడును చేయబడలేదు. ఆయన యిలా అన్నారు, “ఎవడును చేయని క్రియలు నేను వారిమధ్య చేయకుండినయెడల వారికి పాపము లేకపోవును” (యోహాను 15:24ఎ). తన దేవత్వానికి తన క్రియలు చాలిన రుజువుగా ఉన్నాయని ఆయన తలంచారు; “నేను నెరవేర్చుటకై తండ్రి యే క్రియలను నాకిచ్చి యున్నాడో, నేను చేయుచున్న ఆ క్రియలే తండ్రి నన్ను పంపియున్నాడని నన్ను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నవి” అని ఆయన చెప్పాడు (యోహాను 5:36). ఈ క్రియలు సరిపోయినంత మాత్రమేకాదు, క్రీస్తు యొక్క దేవత్వానికి అవి సమృద్ధియైన రుజువును ప్రసాదిస్తాయి. నమ్మనివారందరు శిక్షించబడ్డారు. “నేను ఆయననని మీరు విశ్వసించని యెడల మీరు మీ పాపములలోనేయుండి చనిపోవుదురని” ఆయన (వారితో) చెప్పాడు (యోహాను 8:24).

### దయ్యముల మీద అధికారం

అపవిత్రాత్మలమీద ప్రభువైన యేసు ఉపయోగించిన శక్తి ఆయన మానవాతీతుడన డానికి రుజువైయుంది. బయల్జెబూలువలన ఆయన దయ్యములను వెళ్లగొట్టుతున్నాడని నేరం మోపబడినప్పుడు ఆయన యిలా ప్రత్యుత్తరమిచ్చారు, “ఒకడు బలవంతుడైన వానిని మొదట బంధించితేనే తప్ప, ఆ బలవంతుని ఇంటజొచ్చి వాని సామాగ్రి దోచుకొననేరదు; బంధించినయెడల వానియిల్లు దోచుకొనవచ్చును” (మార్కు 3:27). మానవతీతమైన శక్తి తనకున్నట్టు ఆయన చెప్పుకొన్నాడు.

కేవలం ప్రభువైన యేసు యొక్క ప్రసన్నతయే అపవిత్రాత్మలను కలత పరచింది. కపెర్నహోములోని సమాజమందిరములో “అపవిత్రాత్మ పట్టిన మనుష్యుడొకడుండెను. వాడు – నజరేయుడవగు యేసూ, మాతో మీకేమి, మమ్ము నశింపజేయవచ్చితివా? నీ వెవడవో నాకు

తెలియును; నీవు దేవుని పరిశుద్ధుడవు అని కేకలు వేసెను" (మార్కు 1:24బి). "నీవు దేవుని కుమారుడవు!" అని మరియొకటి అన్నది (మార్కు 3:11బి). తమ్మును నశింపజేయువాడు ఆయనయని అపవిత్రాత్మలు గుర్తించాయి; "కాలము రాకమునుపే మమ్మును బాధించుటకు ఇక్కడికి వచ్చితివా?" అని అవి ఆయనను అడిగాయి (మత్తయి 8:29). ఆయన శక్తి దేవుని శక్తి కంటె తక్కువైనది కాదనడానికి రుజువు ఉన్న సంగతి ప్రక్కనుంచి, యేసు దేవుని కుమారుడని, వారి శిక్షా కాలము ఆసన్నమైనప్పుడు, అవి ఆయనను ఎదుర్కోవలసియుందని ఈ లేఖన భాగాలు సూచిస్తున్నాయి.

**పాపములు క్షమించు అధికారం**

భూమిమీద ఉన్నప్పుడు, ప్రభువైన యేసు పాపాలను క్షమించారు – దానికి శాస్త్రులును, పరిసయ్యులును, దేవుడు తప్ప ఎవడును పాపములు క్షమింపలేడని సరిగానే చెప్పారు (లూకా 5:20, 21). "నీ పాపములు క్షమింపబడినవి" అని ప్రభువు అన్నప్పుడు, దేవదూషణ చేసినట్టు వారు ఆయన మీద నేరము మోపారు. పాపాలు క్షమించే అధికారం తనకు ఉన్నట్టు వారి కన్నులయెదుట ఆ మనుష్యుని ఆయన స్వస్థపరచారు (మత్తయి 9:2–8 మరియు మార్కు 2:1–12లను కూడా చూడు). ఈ సంఘటన రెండు సత్యాలను రుజువు చేస్తుంది: తన సొంత శక్తివలన రోగిని స్వస్థపరచగలవాడు పాపాలను కూడా క్షమించగలడు అనేది ఒకటి. రెండు, యేసు పాపాలను క్షమించగలిగారు (దేవుడు తప్ప మరెవ్వడు దానిని చేయలేడు), గనుక ఆయన దేవుడు.

**పరిమితి లేని శక్తి**

తుఫానును ఆయన సద్దణగజేయడం, కొద్ది రొట్టెముక్కలు మరియు చేపలతో వేలమందికి ఆహారం పెట్టి మిగిలిన ముక్కలను పండ్రెండు గంపలకు ఎత్తడం, నీళ్లమీద నడవడం, చనిపోయినవారిని తిరిగి బ్రతికించడం వంటి వాటిని రివ్యూ చేయడానికి సమయం చాలదు. ఆలాటి సంఘటనలలో ప్రతి ఒక్కదాన్ని ఆధారం చేసికొన్నా, యేసు శరీరమందు దేవుడైయున్నాడనే తీర్మానానికి న్యాయ సమ్మతంగా రావచ్చు. ఏ నరుడును ఎన్నడును అలాటి అద్భుతములను తన శక్తివలన జరిగించలేనందున, నజరేయుడుగా యేసు నామమున జరిగించిన కార్యములు తప్ప (శృంగారమను దేవాలయము ఎదుట కుంటి భిక్షగానిని పేతురు స్వస్థపరచినట్టు అపొ. 3:6), యేసు శరీరమందు ప్రత్యక్షుడైన దేవుడు అని మనం తప్పక తీర్మానానికి రావచ్చు. వ్యక్తిలో యిలాటి శక్తిని ప్రదర్శించగల వేరొకడు లేడు.

## ముగింపు

యేసు దేవుని కుమారుడు, కుమారుడైన దేవుడు సశరీరుడుగా ప్రత్యక్షుడయ్యాడన్న చర్చనీయాంశం సువార్తకు కేంద్ర స్థానమైయుంది. మిగిలినదంతా నిలవడానికి అది పునాదియై యుంటుంది. ఈ సత్యంనుండి, శోధన కాలం సహించడానికి అనేక పాఠాలను మనం పొందొచ్చు.

ప్రభువైన యేసు మోషేకంటే అధికుడు లేక శ్రేష్ఠుడు అనే వాస్తవంపై ఆధారపడి క్రైస్తవ్యం యూదా మతంకంటే మిన్నయైయుంది. యేసు దేవుని కుమారుడు, మోషే కాదు. ఈ విషయం

సవిస్తరంగా హెబ్రీయులకు వ్రాసిన పత్రికలో చర్చింపబడింది.

రెండవది, ప్రభువైన యేసు శరీరమందు దేవుడైయున్నాడన్న సత్యం మీద దేవదూతలకంటే హెచ్చింపబడిన మన నిరీక్షణ ఆధారపడియుంది. ఆయన మనకు మాదిరిగా ఉంచబడ్డాడు; మనం కూడా హెచ్చింపబడతామనే దానికి రుజువుగా ఆయన ప్రథమ ఫలమైయున్నాడు (1 కొరింథీ. 15:20-22; 1 పేతురు 5:6). ఆయనతో, అక్షయమైనది, నిర్మలమైనది, వాడబారనిదియునైన, స్వాస్థ్యము మనకొరకు పరలోకమందు భద్రపరచబడియుంది (1 పేతురు 1:4).

మూడవది, కుమారుడైన దేవుడు రక్తమాంసాలను దాల్చి నరుల మధ్య నివసించడం, నశించినవారి పట్ల ఆయన ప్రేమకు నిదర్శనంగా ఉంది. దేవుడు మనుష్యులను వెదికే చిత్రం మనకు కన్పిస్తుంది. నరుడు దేవుని వెదకాలనే బాధ్యతను గూర్చి ఎక్కువగా చెప్పబడింది; కాని నశించిన దానిని వెదకి రక్షించడానికి దేవుడే అరుదెంచిన కారణాన, నరుడు దేవుని వెదకవలసిన బాధ్యత కలవాడయ్యాడు (లూకా 19:10). దేవుని కుమారుడు పడిపోయిన దేవదూతలను దాటివస్తూ వారికి సహాయాన్ని అందించకుండ, "అబ్రాహాము సంతానానికి సహాయాన్ని అందజేయడాన్ని గమనించడం మనోహరంగా ఉంటుంది" (హెబ్రీ. 2:16). ఆయన ప్రేమించి పైకెత్తింది నరజాతినేగాని దేవదూతలను కాదు.

నాల్గవది, దేవుని కుమారుడు సశరీరుడై, నరుల మధ్య నివసించి. మనుష్యుల కొరకు మృతిపొందాడంటే దేవుని యెదుట మనుష్యులు ఎంత విలువైనవారో అది కనుపర్చుతోంది. మనుష్యుడు పిచ్చుకకంటెను, గొర్రెకంటెను విలువైనవాడని ప్రభువు యూదులకు బోధించాడు. ఆయన నరుల కొరకు చనిపోయాడన్న వాస్తవం, మన స్థానంలో ఆయన తన ప్రాణాన్ని సమర్పించాడన్న విషయం తనకంటెను తన ప్రాణంకంటెను మనలను ఎంతో అధికంగా విలువ కట్టాడని సూచిస్తుంది. ఆయన మనలను రక్షించ గోరుతున్నాడు - మన నరకంనుండి మాత్రమే కాదు, ఈ జీవితంలో ఉన్న పాపంనుండి, ఈ భూమిమీద మన జీవితాలను ఎంత విలువగలవిగా ఉండగలవో అంతటి విలువ గలవిగా ౘదిద్దాలని ఆయన కోరుతున్నాడు. మనం పాపంలో జీవించితే, మనం పనికిమాలిన వారమే. ఆయన కొరకు జీవించడమే మన జీవితాలు విలువగలవిగా ఉంటాయి.

---

సూచనలు

[1]స్టిన్ మార్టర్ *Dialogue of Justin, Philosopher and Martyr, with Trypho, a Jew* 48. Alexander Roberts and James Donaldson, eds., *The Ante-Nicene Fathers: Translations of the Writings of the Fathers down to A.D. 325,* rev. and arr. A. Cleveland Coxe (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1957). [2]Ibid. 49.